

అటవీ కలపకు కాళ్లు..!

- చెట్లను నరికి.. తరలించుకుపోతున్న అక్రమార్కులు
- పట్టించుకునేవారు కరువు



-వార్త 7వ పేజీలో

జల జీవన్ మిషన్ పనుల్లో ఇష్టారాజ్యం

ప్రతిపాదనలకు భిన్నంగా పనులు

- నిధులు దుర్వినియోగం
- కాంట్రాక్టర్లపై లోపించిన అధికారుల పర్యవేక్షణ





సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్


- జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యుల ధ్వజం
- జడ్పీటీసీ సభ్యులకు గౌరవం వేతనం ఏదీ
- అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టానికి లంచం అడుగుతున్నారని ఫిర్యాదులు
- ఏజెన్సీలోని చింతపల్లి, అరకులోయ ఆస్పత్రుల్లో డయాలసిస్ రోగులకు సేవలు అందించాలని డిమాండ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొళాయిల ఏర్పాటు ద్వారా ఇంటింటికీ నీరు అందించే జలజీవన్ మిషన్ పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని జిల్లా పరిషత్ సభ్యులు ఆరోపించారు. పనుల చేపట్టిన కాంట్రాక్టర్లు, పర్యవేక్షించే అధికారుల్లో జవాబుదారీతనం లేదని ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. జలజీవన్ మిషన్ పనులపై చర్చను చైర్‌పర్సన్ ప్రారంభిస్తూ ఏజెన్సీలో చేపడుతున్న పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయన్నారు. టెండర్‌లో పొందు పరిచిన విధంగా కాకుండా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు దుర్వినియోగమం అవుతున్నాయన్నారు. చింతపల్లి జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యత లేదన్నారు. హుకుంపేట, డుంబ్రిగుడ జడ్పీటీసీ సభ్యులు రేగా మత్స్యలింగం, చాత్రాయి జానకమ్మ మాట్లాడుతూ ప్రతిపాదనల్లో పేర్కొన్న మేరకు ఇంటింటికీ కొళాయిలు వేయడం లేదని, బోర్ల తవ్వకాల్లో కూడా అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం విఫలమైందని, మోటార్లు పనిచేయడం లేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా మంజూరుకావడం లేదన్నారు. రాంబిల్లి జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు మాట్లాడుతూ ఈ పథకంలో సొమ్ములు సరిపోవడం లేదని పంచాయతీల నుంచి కొంత మొత్తం తీసుకున్నారని చెప్పగా, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ ఇంటింటికీ కొళాయిల కోసం రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సభ్యుల ప్రశ్నలకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ... మిగతా 7వ పేజీలో

ఇళ్ల స్థలాలు అమ్ముకుంటున్నా చర్యలు లేవు

- జగనన్న లే అవుట్‌లలో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణ
- ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువు
- బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడి ఆరోపణ. 7లో

అచ్చియ్యపేటలో భూ కబ్జా



జగనన్న కాలనీకి ఆనుకుని ప్రభుత్వ భూమి ఆక్రమణ

- చదును చేసి రెండేసి సెంట్ల చొప్పున ప్లాట్లు
- ఒక్కో ప్లాట్ రూ.6 లక్షలకు విక్రయం
- ఆక్రమించిన భూమి విలువ రూ.2 కోట్లు పైమాటే!
- కబ్జాదారులకు స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారం



సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేట జగనన్న కాలనీకి సమీపంలో కబ్జాదారులు చదును చేసిన ప్రభుత్వ భూమి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార వైసీపీ నేతలు అక్రమాలను ఉధృతం చేశారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా.. అధికారంలో వున్నప్పుడే సాధ్యమైనంత ఎక్కువ సొమ్ము సంపాదించాలని తాయపత్రయ పడుతున్నారు. ప్రభుత్వ భూముల కబ్జా, బంజరు భూములు తమ సాగులో వున్నట్టు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించడం, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్/ మట్టి తవ్వకాలు, నదుల్లో నుంచి ఇసుక తరలింపు.. ఇలా పలురకాల అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటిపై పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు కనీస చర్యలు చేపట్టడంలేదు. పైగా కొంతమంది అధికారులు, కిందిస్థాయి సిబ్బంది.. అధికార పార్టీ నాయకులకు సహకరిస్తున్నారు. అనకాపల్లి మండలంలో బవులువాడ, మారేడుపూడి, శంకరం, తదితర గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లకు సమీపంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వైసీపీ నాయకులు.. తాజాగా సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో జగనన్న కాలనీకి సమీపంలో సుమారు ఎకరా ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేశారు. ప్లాట్లుగా విభజించి సెంట్లు చొప్పున విక్రయిస్తున్నారు.



రెండేసి సెంట్ల చొప్పున ప్లాట్లుగా వేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ సీతానగరం రెవెన్యూ పరిధిలోని అచ్చియ్యపేటలో సర్వే నంబరు 511లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు రెండున్నరేళ్ల క్రితం జగనన్న కాలనీ పేరుతో లేఅవుట్ వేశారు. సీతానగరం, అచ్చియ్యపేట గ్రామాలకు చెందిన 74 మందికి ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించారు. వీరిలో సుమారు 40 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. కాలనీలో మౌలిక వసతుల కల్పన పనులు సాగుతున్నాయి. ఇదిలావుండగా అనకాపల్లి పట్టణానికి సమీపంలో ఈ లేఅవుట్ ఉండడంతో ఇళ్ల స్థలాలకు డిమాండ్ ... మిగతా 8వ పేజీలో

వైసీపీ నేతలు బరి తెగింపు

సొంత భూములకు రోడ్డు కోసం పంట కాలువ పూడ్చివేత

- ఎకరానికిపైగా ఆక్రమణ
- ఉపాధి హామీ పథకం మాటున రహదారి నిర్మాణం
- ఐదు రోజుల నుంచి పనులు
- టీడీపీ నేతల దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్థులు
- వీఆర్వో, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు
- పనులు నిలుపుదల



భరిణికం రెవెన్యూ పరిధిలో పంట కాలువ మీదుగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు

పరవాడ, ఫిబ్రవరి 14:

ఉపాధి పనుల ముసుగులో వైసీపీ నాయకులు బరి తెగింపు చర్యలకు పూనుకున్నారు. తాము కొనుగోలు చేసిన భూమికి రోడ్డు కోసం ఎకరానికిపైగా పంట కాలువను పూడ్చివేసి 30 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపట్టారు. ఉపాధి పథకం కూలీలతో పనులు చేయించి ప్రభుత్వం తరపున రహదారి ఏర్పాటు చేస్తున్నట్టు ఎత్తుగడ వేశారు. టీడీపీ నాయకులు రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం బయటపడింది. మండలంలోని భరిణికం రెవెన్యూ పరిధిలో వైసీపీ నేతల భూ దందాకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

భరిణికం రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 180, 181లలో ఒక ఎకరా 19 సెంట్ల విస్తీర్ణంలో పంట కాలువ ఉంది. దీనికి ఎగువున ఉన్న నడిం చెరువు నుంచి దిగువున ఉన్న పెద్ద చెరువుకు ఈ కాలువ ద్వారా నీరు చేరుతుంది. కాగా ఈ కాలువకు అవతల వైపున భరణికం గ్రామానికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు గతంలో సుమారు మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. దీనిలో లేఅవుట్ వేసి ఇళ్ల స్థలాలుగా విక్రయించాలని భావించారు. అయితే ఈ భూమిలోకి వెళ్లడానికి రహదారి లేదు. ప్రధాన రహదారికి, ఈ భూమికి మధ్యలో పంట కాలువ వుంది. లేవుట్‌కు 40 అడుగుల రోడ్డు వుంటేనే స్థలాలు అమ్ముకోవడానికి వీలవుతుంది. దీంతో వైసీపీ నాయకుల కళ్లు పంట కాలువపై పడ్డాయి. కాలువకు ఆనుకుని ఉన్న తాటి, ఇతర చెట్లను కూల్చివేయించారు. ఐదు రోజుల క్రితం ఉపాధి హామీ పథకం కింద కూలీలతో రహదారి ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఉపాధి కూలీలు పనులు చేస్తుండడంతో ప్రభుత్వమే రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నదని స్థానికులు భావించారు. అయితే ... మిగతా 8వ పేజీలో



రహదారి ఏర్పాటు పనుల్లో ఉపాధి కూలీలు

అమర్‌కు అవకాశం దక్కేనా?

పార్టీలో జోరుగా చర్చ

- ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గానికి మలసాల భరత్‌ను ఇన్‌చార్జిగా ప్రకటించిన అధిష్ఠానం
- చోడవరం, ఎలమంచిలి వైపు మంత్రి చూపు
- వ్యతిరేకించిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- స్వయంకృతాపరాధమేనంటున్న అనుచరవర్గం
- అనకాపల్లి నుంచి తప్పుకుంటానని సీఎంకు స్వయంగా ఆయనే చెప్పినట్టు ప్రచారం



గుడివాడ అమర్‌నాథ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కుతుందా?, లేదా?...అనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, దాదాపు అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని, ఒకటి, రెండు మార్పులతో ఆఖరి జాబితా త్వరలో విడుదల చేస్తామని అన్నారు. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో మంత్రి అమర్‌నాథ్‌కు ఇప్పటివరకూ ఏ నియోజకవర్గం కేటాయించలేదు. దాంతో ఆయన పరిస్థితి ఏమిటని ఆయన అనుచర వర్గం ఆందోళన చెందుతోంది. అంతా ఆయన స్వయంకృతాపరాధమేనని అంటోంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అమర్ నియోజకవర్గం (అనకాపల్లి)లో 'సొంత వర్గం' తయారుచేసుకున్నారు. ఇంకా భూముల వ్యవహారాలు, ఆర్‌ఈసీఎస్‌లో అడ్డగోలు నియామకాల్లో ఆయన పేరు వినిపించింది. ఇక తన శాఖల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చేసిన మేలు ఏమీ లేకపోవడంతో పారిశ్రామిక వర్గాలు కూడా ఆయనకు ఆమడ దూరంలోనే ఉండిపోయాయి. పార్టీలో చిన్న పదవి వస్తే ఆ సామాజికవర్గం అంతా కలిసి భారీ సన్మానాలు చేయడం రివాజుగా మారింది. కానీ అమర్‌నాథ్‌కు మంత్రి పదవి వచ్చిన తరువాత తన సొంత సామాజికవర్గంలో నేటి వరకు ప్రత్యేకంగా గౌరవించి, సన్మానం చేయకపోవడం గమనార్హం. అధికారం చేపట్టగానే నోటికి వచ్చినట్టు మాట్లాడడమే అందుకు కారణమని ప్రచారం జరుగుతోంది.

ఇదిలావుండగా పార్టీలో అభ్యర్థుల ఖరారు ప్రక్రియ ప్రారంభం కాగానే పార్టీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అమర్ కలిసి...'తనకు అనకాపల్లి కాకుండా వేరే నియోజకవర్గం ఏదైనా కేటాయించండి' అని స్వయంగా కోరినట్టు సమాచారం. దీంతో పెందుర్తి, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల నుంచి అమర్ పోటీ చేస్తే ఎలా ఉంటుంది?...అనే అంశంపై సర్వే చేయించారు. ఈ విషయం తెలిసి చోడవరం, ఎలమంచిలి ఎమ్మెల్యేలు గట్టిగా వ్యతిరేకించడంతో అమర్‌కు ఇప్పటివరకూ ఎక్కడా సీటు ఖరారు చేయలేదు.

మలసాలకు సిఫారసు

అనకాపల్లి నుంచి నువ్వు పోటీ చేయకపోతే ఎవరైతే బాగుంటుందో సూచించాలని సీఎం కోరినప్పుడు...అన్ని విధాలా తనకు విశ్వాసపాత్రుడిగా ఉండే మలసాల భరత్‌ని తీసుకువెళ్లి సీఎంకు పరిచయం చేశారు. దాంతో భరత్‌నే నియోజకవర్గ ఇన్‌చార్జిని చేశారు. అలా అనకాపల్లి నుంచి పోటీ చేసే అవకాశం పోయింది. ఇక ఎలమంచిలిలో తన కుటుంబాన్ని కాదని అమర్‌కు టికెట్ ఇస్తే...ఆయన ఓటమికే పనిచేస్తానని సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజు అధిష్ఠానానికి చెప్పినట్టు ప్రచారం జరిగింది. దాంతో అక్కడ కూడా అవకాశం పోయింది. చోడవరంలో తనను తప్పించి ఎవరికి ఇచ్చినా ఓకే గానీ...అమర్‌కు ఇస్తే మాత్రం ఒప్పుకొనేది లేదని ధర్మశ్రీ పార్టీ పెద్దలకు చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ... మిగతా 8వ పేజీలో

ఉత్తరాంధ్రకు నిధులపై సమాచారం ఇవ్వండి -7లో

- ఆర్టీఐ ద్వారా సీఎస్‌కు కొణతాల దరఖాస్తు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)



నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం ఇస్తున్న పీటీడీ ఉద్యోగులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని, బకాయిల వాయిదాల పర్వాన్ని నిరసిస్తూ ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపుతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 12వ పీఆర్సీ మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే ప్రకటించి అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో వున్న డీఏలు విడుదల చేయాలని, గురుకుల సొసైటీ, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 10, 15 శాతాలను కొనసాగించాలని, ఎన్ఎంఆర్, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ పార్ట్ టైం ఫుల్ టైం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రతి నెలా 1న జీతాలు, పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలు, డిమాండ్లకు సంబంధించిన వినతిపత్రాలను రెవెన్యూ అధికారులకు అందజేశారు.

ఉద్యోగాల పేరుతో ఖాకీ చీటింగ్

పోలీసు శాఖ, డాక్ యార్డులో కొలువులంటూ నిరుద్యోగులకు బురిడీ

- సోదరుడితో కలిసి పలువురి నుంచి రూ.30 లక్షలకు పైగా వసూలు
- ఎంతకాలమైనా ఉద్యోగాలు రాకపోవడంతో నిలదీసిన బాధితులు
- డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో స్పందనలో ఫిర్యాదు
- జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన చోడవరం పోలీసులు
- విశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు

చోడవరం, ఫిబ్రవరి 14: పోలీస్ శాఖ, విశాఖలోని నేవల్ డాక్ యార్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగుల నుంచి రూ.30 లక్షలకుపైగా వసూలు చేసి మోసగించిన పోలీస్ కానిస్టేబుల్, అతని సోదరుడిపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలిలా వున్నాయి.

చోడవరం పట్టణంలోని దుద్దువీధికి చెందిన కశిరెడ్డి రమణమూర్తి విశాఖ నగర పరిధిలోని కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తన సోదరుడు మోహన్‌బాబుతో కలిసి పోలీసు శాఖలో, విశాఖలోని నేవల్ డాక్ యార్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామని చోడవరం నాడువీధికి చెందిన ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీ పట్టివేత

» 67 పశువులు స్వాధీనం... ఇద్దరి అరెస్టు


లారీ కంటైనర్‌లో ఉన్న పశువులు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 14: మండలంలోని గెడ్డపాలెం రోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం కబేలాలకు అక్రమంగా తరలిస్తున్న 67 ఆవులు, ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ లారీని పట్టుకున్నట్టు ఎస్ఐ అట్టాడ విభీషణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట సంత నుంచి విజయవాడ హనుమాన్ జంక్షన్‌కు వెళుతున్న కంటైనర్ లారీ మండలంలోని గెడ్డపాలెం రోడ్డు వద్ద ఆగి ఉంది. అదే సమయంలో పెనుగొల్లుకు చెందిన గో రక్షణ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గొర్ల దేముళ్లు, ఆర్. లోవరాజు, ఎస్. దేముళ్లు బైక్‌లపై వెళుతుండగా కంటైనర్ లారీ నుంచి శబ్దాలు వినిపించాయి. దీంతో అక్కడ ఆగి కంటైనర్‌ను పరిశీలించిన ఆ ముగ్గురూ అనుమానం వ్యక్తం చేస్తూ డ్రైవర్‌ను డోర్ తెరవాలని కోరగా.. అందుకు అంగీకరించలేదు. దీంతో పలువురు స్థానికులతో కలిసి డోరు తెరిచి చూపించాలని, ఏమీ లేకపోతే పంపించేస్తామని గట్టిగా చెప్పడంతో డ్రైవర్ డోరు తెరిచాడు. దీంతో లోపల చూడగా డబుల్ డక్ టైపులో పశువులు ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమచారం ఇవ్వడంతో కొద్ది సేపటికి అక్కడికి చేరుకున్న పోలీసులు పశువులతో ఉన్న కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, పశువుల తరలింపునకు చెందిన వ్యక్తిని అదుపులోకి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. అలాగే పశువులను గోశాలకు తరలించడం జరుగుతుందని ఎస్ఐ చెప్పారు.

చోడవరంలో యూట్యూబ్ విలేకరుల దందా

» పోలీసుల పేరుతో బెదిరింపులు
» వ్యాపారి నుంచి రూ.లక్షా 50 వేలు వసూలు
» మరో రూ.4 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరింపులు
» పోలీసులకు ఫిర్యాదు ... నిందితుల అరెస్టు

చోడవరం, ఫిబ్రవరి 14 : పట్టణ పరిధిలో ఓ వ్యాపారి నుంచి పోలీసులమంటూ బెదిరించి రూ.లక్షా 50 వేలు వసూలు చేయడంతో పాటు, అతని నుంచి స్కూటీని బలవంతంగా ఎత్తుకు వెళ్లిన యూట్యూబ్ విలేకరులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ కొంతకాలం క్రితం గంజాయి కేసులో ఇరుక్కుని సస్పెండ్ అయిన బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన వీర్ల నారాయణమూర్తి అలియాస్ నానాజీ, చోడవరం పట్టణంలోని ఎడ్ల వీధికి చెందిన కేతవరపు బెన్నిబాబు అలియాస్ బన్ని ఓ యూట్యూబ్‌కు విలేకరులుగా పనిచేస్తున్నారు. వీరితో పాటు ఎడ్లవీధికి చెందిన తమటపు వెంకట శివప్రసాద్, డెల్లి అప్పారావులు కలిసి ఇటీవల కాలంలో పలు చోట్ల విలేకరులు, పోలీసులమంటూ వసూళ్లదందా నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే పట్టణ శివారు గాంధీగ్రామంలో నివాసం ఉంటున్న చిరువ్యాపారి అలకుంట సాయిలు, అతని అల్లుడు ఆకుల శ్రీనులు గత నెల 27న చోడవరం నుంచి చీడికాడ వెళుతుండగా, తెల్లవారుజామున వారి వాహనాలను అడ్డుకున్న ఈ నలుగురూ తాము పోలీసులమని బెదిరించి వారి వద్ద ఉన్న రూ.లక్షా 50వేల నగదును బలవంతంగా తీసుకున్నారు. అలాగే, వారి వద్ద నుంచి స్కూటీ వాహనాన్ని కూడా గుంజుకుని వెళ్లిపోయారు. ఈ డబ్బులు కాకుండా మరో నాలుగు లక్షలు ఇవ్వాలని బాధితులను ఈ బృందం బెదిరించడంతో పాటు, డబ్బులు ఇవ్వకపోతే కుటుంబ సభ్యులను హతమారుస్తామని హెచ్చరికలకు పాల్పడ్డారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు యూట్యూబ్ విలేకరులైన నానాజీ, బెన్నిబాబులతో పాటు, వారికి సహకరించిన వెంకట శివప్రసాద్, డెల్లి అప్పారావులపై దోపిడీ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.లక్షా 19వేల నగదుతో పాటు, స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కాగా, అరెస్టయిన నిందితులలో వడ్డాదికి చెందిన నానాజీ గతంలో పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ ఓ గంజాయి కేసు వాహనానికి ఎస్కార్టుగా వ్యవహరించాడన్న ఆరోపణలపై సస్పెండైనట్టు సమాచారం. ఇటీవల కాలంలో యూట్యూబ్ విలేకరిగా మారి పలుచోట్ల దందాలు, బలవంతపు వసూళ్ల నిర్వహిస్తున్నారని పోలీసువర్గాల సమాచారం. ఇతనిపై గతంలో కూడా కేసులు నమోదైనట్టు చెపుతున్నారు.

జల జీవన్ మిషన్ పనుల్లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఎస్.శివానందకుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఈఈ లీలాకృష్ణ వివరణ ఇస్తూ నిబంధనల మేరకు కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో కమ్యూనిటీ కాంట్రాక్టు కమిటీలకు పనులు అప్పగించామన్నారు. జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు జోక్యం చేసుకుని జల జీవన్ మిషన్ పనుల వివరాలను గ్రామాల వారీగా బోర్డులు ఏర్పాటుచేసి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఆరు నెలలుగా జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందడం లేదని చింతపల్లి సభ్యుడు పోతురాజు బాలయ్య ఆవేదన వ్యక్తంచేయగా...గత ఏడాది జూలై, ఆగస్టు నెలల బిల్లులు అప్‌లోడ్ చేశామని, ఆ తరువాత నెలల బిల్లులు ఇంకా మంజూరు కాలేదని సీఈవో తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖపై పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు నిర్వహించిన రోగులకు కళ్లద్దాలు పంపిణీ పూర్తిగా జరగలేదని ప్రస్తావించగా అనకాపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్ బదులిస్తూ దశల వారీగా అందజేస్తామన్నారు. మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సోమసత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించేందుకు లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించగా అందులో వాస్తవాలు ఉన్నాయని బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు పేర్కొనడంతో...చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేయగా, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటు, పాముకాటుకు వ్యాక్సిన్ వేయడానికి సూదులు కొరత ఉందని జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పేర్కొన్నారు.

చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కొయ్యూరు, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు వారా నూకరాజు, దేశరి గంగరాజు మాట్లాడుతూ కొందరు వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతగిరి నుంచి రోగులకు అత్యవసర వైద్యం కోసం నేరుగా విశాఖకు తీసుకురావడానికి అంబులెన్స్ ఇవ్వడం లేదని గంగరాజు ఆరోపించగా, సమస్యను పరిష్కస్తామని 108 కో-ఆర్డినేటర్ హామీ ఇచ్చారు. కొయ్యూరు మండలాధ్యక్షుడు బి.రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో డయాలసిస్ రోగులకు వైద్యం అందుబాటులో లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కొయ్యూరు నుంచి నర్సీపట్నం ఆస్పత్రికి వస్తే రిజిస్టర్ చేసుకున్న 25 రోజుల తరువాత డయాలసిస్ చేస్తున్నారన్నారు. ఆయనతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర సభ్యులు ఏకీభవిస్తూ ఏజెన్సీలోని చింతపల్లి, అరకులోయ ఆస్పత్రుల్లో డయాలసిస్ సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు. ఏజెన్సీలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, సకాలంలో వైద్యం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం ఆందోళన వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు తక్షణ సేవలు అందించే యంత్రాంగం ఏర్పాటుచేయాలన్నారు. దీనికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందిస్తూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు అంబులెన్స్ సిబ్బంది కొంత వరకు ప్రాథమిక చికిత్స చేస్తారని, తీవ్రంగా గాయపడితే వెంటనే ఆస్పత్రిలో చేర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏజెన్సీకి చెందిన పలువురు జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

అటవీ కలపకు కాళ్లు..!

» చెట్లను నిర్భయంగా నరికి తరలించుకుపోతున్న అక్రమార్కులు
» యథేచ్ఛగా ఈ తంతు సాగుతున్నా పట్టించుకునేవారు కరువు
» ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు వేడుకోలు


సరుగుడు అడవి నుంచి విలువైన కలప సైకిల్‌పై తరలింపు


అడవిలో కలపను కాల్చి.. బొగ్గుగా తయారు చేసి తరలించుకుపోతున్న దృశ్యం

నాతవరం, ఫిబ్రవరి 14: అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం అక్రమార్కులకు బాగా కలిసి వస్తోంది. ఫలితంగా ఇష్టారాజ్యంగా చెట్లను నరికి తరలించుకుపోతున్నారు. దీనిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టకపోవడంతో ఒకరిని చూసి మరొకరు అన్నట్టుగా అడవుల్లోకి చొరబడుతున్నారు. మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన సరుగుడు, అచ్చెంపేట ఫారెస్టులో పట్టపగలే కొందరు నల్ల మద్ది, తంగేడు, వెదరు చెట్లను నరికి ముక్కలుగా కోసి బైక్‌లపై తరలించుకు పోతున్నారంటే.. దీని వెనుక ఎవరు ఉన్నారన్న అనుమానాలు అంతటా వ్యక్తమవుతున్నాయి. ఇంతలా ఈ తతంతు సాగుతున్నా విధుల్లో ఉన్న వెదురుపల్లి గార్డు గానీ, సరుగుడు బీట్ ఆఫీసర్‌గాని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అచ్చెంపేట, రామన్నపాలెం తదితర గ్రామాలలో కొందరు జీడితోటలను నరికి ఆ కలపను సరుగుడు తారురోడ్డు పక్కనే వేస్తున్నారు. రాత్రి వేళల్లో లారీల్లో ఆ కర్రలను వేసేటప్పుడు మధ్యలో సరుగుడు ఫారెస్టులోని విలువైన కలపను కూడా తరలించుకునిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే, అచ్చెంపేట దగ్గరలో విలువైన టేకు చెట్లు ఉన్నాయి. అప్పుడప్పుడు మధ్యలో ఉన్న టేకు చెట్లను నరికి రాత్రివేళ తరలిస్తున్నట్టు సమాచారం. కొందరు తరచూ సరుగుడు ఫారెస్టులో చెట్లను నరికి ఆ తర్వాత ఆ దుంగలను చమ్మచింత, నాతవరం, సరుగుడు తదితర గ్రామాలకు తరలించి అక్కడ టేకు కలపతో మంచాలు తయారు చేసి నర్సీపట్నం, తుని తదితర ప్రాంతాల్లో విక్రస్తున్నట్టు తెలిసింది. అలాగే కరకకొండ, పెడిమికొండపై ఉన్న చెట్లను కొందరు నరికేసి ఆ కలపను బట్టీల్లో కాల్చి బొగ్గును తయారు చేసి రోజూ బస్తాలకు బస్తాలు బైక్‌ల ద్వారా ఇతర ప్రాంతాలకు తీసుకు వెళుతున్నారు. పట్టపగలే ఈ తంతు సాగుతున్నా అడ్డుకట్ట వేసేవారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించకుంటే విలువైన అటవీ సంపద మరింత కనుమరుగు కావడం తథ్యమని పలువురు చెపుతున్నారు. ఈ విషయమై నాతవరం ఫారెస్టు అధికారి మహేష్‌ను వివరణ కోరగా, అడవిలో కలప తరలిపోతున్నట్టు తన దృష్టికి రాలేదన్నారు.



అచ్చెంపేట ఫారెస్టులో టేకు చెట్టు నరికేయడంతో మిగిలిన ఉన్న మోడులు

ఇళ్ల స్థలాలు అమ్ముకుంటున్నా చర్యలు లేవు

» జగనన్న లే అవుట్‌లలో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణ
» ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువు » బుచ్చెయ్యపేట జడ్పీటీసీ ఆరోపణ
» ఎటువంటి అక్రమాలు జరగలేదని జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ బదులు
» ఆగ్రహం వ్యక్తం చేసిన పలువురు సభ్యులు » సర్ది చెప్పిన విశాఖ జేసీ


సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీని ప్రశ్నిస్తున్న జడ్పీటీసీ సభ్యులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ తీరుపై జడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పురోగతిపై తొలుత అనకాపల్లి జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ రమామణి వివరించారు. ఈ దశలో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు జోక్యంచేసుకుని బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలను కొందరు అమ్ముకున్నారని ఆరోపించారు. అలాగే, జగనన్న లే అవుట్‌లలో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించుకుని దుకాణాలు నిర్మిస్తుండడంపై గతంలో ఫిర్యాదు చేశామన్నారు. ఇంటి స్థలాలను అమ్ముకున్న వ్యక్తులు అక్కడే ఇళ్ల నిర్మాణం కోసం సిమెంట్, ఇనుము, ఇసుక తీసుకున్నారని ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయిందని వివరించారు. జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని వారం రోజుల్లో విచారించి నివేదిక ఇవ్వాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఈ దశలో పీడీ మాట్లాడుతూ బుచ్చెయ్యపేట మండలంలో జగనన్న కాలనీలపై రెవెన్యూ అధికారులు విచారించారని అయితే ఎటువంటి అక్రమాలు జరగలేదని తేల్చారని పేర్కొనగా, దొండా రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా ఆమె వినిపించు కోకుండా మాట్లాడడంతో పరవాడ జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజుతో పాటు మరికొందరు లేచి పీడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో సభ్యులు చెప్పిన విషయాలు తొలుత సావధానంగా విని, తరువాత వివరణ ఇవ్వాలే తప్ప వాగ్వాదానికి దిగడం మంచిది కాదని ఆగ్రహించారు. దీంతో విశాఖ జేసీ మయూర్‌అశోక్ జోక్యం చేసుకుని సభ్యులతో వాగ్వాదం మంచిది కాదని పీడీని మందలించారు. అప్పటికీ ఆమె ఏదో చెబుతుండంతో సభ్యులంతా ఒక్కసారిగా లేచి.. హౌసింగ్ పీడీ మాకొద్దు అంటూ తెగేసి చెప్పారు. జిల్లాలో చాలాచోట్ల పలువురు ఇళ్లు అమ్ముకుంటున్న వ్యవహారంపై విచారణ జరపాలని కోరగా జేసీ స్పందించి.. ప్రభుత్వం ఇచ్చే ఇళ్లను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని అనకాపల్లి డీఆర్వో దయానిధిని ఆదేశించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గృహనిర్మాణ ప్రగతిపై అక్కడ పీడీ డి.బాబు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల కోసం సిమెంట్ నిల్వకు గోదాముల కొరత ఉందని పేర్కొన్నారు. జల వనరుల శాఖపై జరిగిన చర్చలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ చెరువులు, కాల్వల ఆక్రమణపై ఫిర్యాదుచేస్తే ఎన్నికల విధులు తప్ప ఇతర విధులు చేయమని అక్కడ తహసీల్దార్ చెబుతున్నారన్నారు.

భూముల రీసర్వే పనులు పూర్తయిన తరువాత భూముల మధ్య సరిహద్దు రాళ్ల ఏర్పాటు లోపభూయిష్టంగా ఉందని ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు. మునగపాక మండలం గవర అనకాపల్లిలో కాలువలకు వేసిన షట్టర్లను దొంగలు ఎత్తు కుపోయి నెలలు గడిచినా ఇంత వరకు పట్టిం చుకోలేదని జడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణ ఆరోపించారు. కాగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభకు వెళుతున్నందున సభ్యులు అభినందించారు. ఇది లావుండగా ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, కరణం ధర్మశ్రీ తప్ప మిగిలిన ఎమ్మెల్యేలు హాజరుకాలేదు.

సంజీవయ్యకు నివాళి


సంజీవయ్య చిత్రపటం వద్ద కలెక్టర్ నివాళి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిరస్మరణీయులని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం నిర్వహించిన సంజీవయ్య జయంతి వేడుకలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

సంజీవయ్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సంజీవయ్య చిత్రపటానికి ఎస్పీ మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అంజలి ఘటిస్తున్న ఎస్పీ

ఉత్తరాంధ్ర సమస్యలపై సమాచార సేకరణ

» 16 అంశాలపై ఆర్టీఐ ద్వారా దరఖాస్తులు
» రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఫిబ్రవరి 14: ఉత్తరాంధ్ర ప్రధాన సమస్యలపై సమాచారాన్ని జనసేన నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సేకరిస్తున్నారు. తనకు కావలసిన 16 ప్రధాన అంశాలపై సమాచారాన్ని కొణతాల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆర్టీఐ ద్వారా కోరారు. ఇందుకు సంబంధించి బుధవారం కొణతాల రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్రలోని 2014 నుంచి 2023 వరకు సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన బడ్జెట్.. ఖర్చు ఎంత.. వంటి నిర్దిష్ట సమాచారాన్ని కోరారు. సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2019 జూన్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 10వరకు నిర్వహించిన సమీక్షా సమావేశాలు, మినిట్స్ సమాచారాన్ని అడిగారు. 2019లో ఉత్తరాంధ్రలో సాగులో ఉన్న మెట్ట, మాగాణి, పంటభూమి ఎంత ఉంది.? ఈ సమాచారాన్ని పాత జిల్లాల వారీగా నిర్దిష్ట సమాచారాన్ని కోరారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించాలని కేంద్రప్రభుత్వానికి, ప్రధానమంత్రికి, ఇతర కేంద్ర మంత్రులకు 2019 జూన్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 4 వరకు ముఖ్యమంత్రి సమర్పించిన వినతిపత్రాలు, రాసిన లేఖలు, వాటికి వచ్చిన సమాధానాల వివరాలు తెలపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ఎంత నిధులు కేటాయించారు.. వాటిలో ఎంత మొత్తంలో ఖర్చు చేశారో కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరుతూ ప్రధానమంత్రికి, సంబంధిత కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి సమర్పించిన వినతిపత్రాలు, రాసిన లేఖలు వాటికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి, ఇతర కేంద్ర మంత్రుల నుంచి వచ్చిన సమాధానాల వివరాలను కోరారు. ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలు, వాటి భర్తీకి ఇప్పటి వరకు ఇచ్చిన నోటిఫికేషన్లు, ఖాళీల భర్తీకి తీసుకున్న చర్యలకు సంబంధించి నిర్దిష్ట సమాచారాన్ని కోరారు. తూర్పుకాపు, కొప్పుల వెలమ, కళింగ, యాదవ, మత్స్యకార, కాపు, గవర, వైశ్య బ్రాహ్మణ తదితర సామాజిక వర్గాల కార్పొరేషన్లకు కేటాయించిన బడ్జెట్ ఎంత, ఖర్చుచేసింది ఎంత వంటి సమాచారం కోరారు. గృహ నిర్మాణ పథకం, పట్టణాల్లో, గ్రామాల్లో అర్హులైన వారికి ఎన్ని ఇళ్లు నిర్మించారు.. తదితర వాటిని ఆయన కోరినట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలంటూ కార్మిక సంఘాల ప్రదర్శన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘం, రైతు కూలీల సంఘం ప్రతినిధులు బుధవారం పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. అలాగే చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి రింగురోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, రైతు కూలీ సంఘం కన్వీనర్ అజయ్‌కుమార్, రైతు సంఘాల నాయకులు అప్పలరాజు, సంతోష్, చలపతి, దొరబాబు, శంకరరావు, గణేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికసంఘాల నాయకులు

పోషక విలువలతో.. మిల్లెట్ పానీ పూరీ

వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోగం

» త్వరలో ఆర్ఏఆర్ఎస్‌లో మిల్లెట్ ఫెస్టివల్ : ఏడీఆర్


మిల్లెట్ పానీపూరీ తయారు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 : నోరూరించే పానీపూరీకి కొత్త రుచులుగా పోషక విలువలు జోడించి మిల్లెట్ పానీ పూరీని రూపొందించారు అనకాపల్లి వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు. ఈ కొత్త స్నాక్ విశేషాలను ఆర్ఏఆర్ఎస్‌లో విద్యార్థులు బుధవారం వివరించారు. తమ ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా వీరు పానీపూరీ తయారీలో మైదాపిండి, గోధుమ పిండికి బదులు కొర్ర, రాగి, చోడి పిండిని వినియోగించారు. కొద్ది గోధుమనూకను కూడా ఈ మిశ్రమానికి కలిపారు. మైదాలో పోషక విలువలు నాస్తి అందుకే మంచి పోషక విలువలున్న చిరుధాన్యాలను మైదాకు బదులుగా వినియోగించారు. చింతపండు రసంతో తయారు చేసే పానీకి బదులు పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరియాల పొడి జ్యూస్‌ను వినియోగించారు. దీనికి కొద్దిపాటి చింతపండు రసాన్ని కూడా రుచి కోసం కలిపారు. ఇలా తయారు చేసే మిల్లెట్ పానీ పూరీలో రుచి, పోషక విలువలు ఉన్నాయి. అంతేకాక చెరకు రసం పానీపూరీని కూడా ప్రయోగాత్మకంగా తయారు చేశారు. చెరకు రసం - చింతపండు రసంతో మేళవించి తయారు చేసే మరో పానీపూరీ రకం కొత్తరుచినిచ్చిందంటున్నారు. పానీపూరీ తయారీలో కొద్దిగా బెల్లం పౌడర్‌ను కూడా వాడారు. ఐరన్, జింక్, కాల్షియం, మాంసకృత్తులు లభించే ఆర్ఏఆర్ఎస్ మిల్లెట్ పూరీకి ప్రాచుర్యం కల్పించేందుకు త్వరలో ఆర్ఏఆర్ఎస్‌లో మిల్లెట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే. జగన్నాథరావు తెలిపారు. ఈ కొత్త వంటకాలను రూపొందించిన విద్యార్థులు ఎం. శేషసాయి, ఎం.పూర్ణిమ, ఇ.ధనలక్ష్మి, సి. గణేశ్వరి, ఎ.విజయలక్ష్మి, కె.దివ్యకుమారిలను పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్.గోపాలస్వామి అభినందించారు.

పారిశ్రామికవాడగా నక్కపల్లి అభివృద్ధి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


శిలాఫలకం ఆవిష్కరణలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు

అనకాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నక్కపల్లి ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేయనున్నట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం తాడేపల్లి నుంచి నిర్వహించిన వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నక్కపల్లి క్లస్టర్‌లో రూ.331.8 కోట్లతో 1,120 ఎకరాల్లో పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ క్లస్టర్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులు, విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు పనులు త్వరలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టరు టెండర్ల ద్వారా పొందారన్నారు. పరవాడలో రూ.250 కోట్లతో విసు వీఎస్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ పరిశ్రమ 21.8 ఎకరాల్లో ఏర్పాటు చేసి, 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. అంతకుముందు తాడేపల్లి నుంచి పరిశ్రమలు, ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాను పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నక్కపల్లి ప్రాంతం విశాఖపట్నం, కాకినాడకు మధ్యలో ఉన్నందున గంగవరం, కాకినాడ పోర్టులతోపాటు జాతీయ రహదారి చెంతనే ఉండడం వల్ల పారిశ్రామికంగా అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్‌ఎం త్రినాథ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, నక్కపల్లి జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, ఎంపీపీ రత్నం, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు, సర్పంచ్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు రాజధానిపై మాట్లాడే హక్కు లేదు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రాజధాని ఎక్కడో ప్రజలకు చెప్పకుండా మూడు ముక్కలాట ఆడిన వైసీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్మోహన్ రెడ్డికి రాజధాని గురించి మాట్లాడే నైతికహక్కు లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. అమరావతి రైతులు ఉద్యమిస్తున్నా వారి గురించి పట్టించుకోని సీఎం జగన్ రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వేధిస్తున్నారన్నారు. రాష్ట్ర ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉండాలని ఉత్తరాంధ్ర వైసీపీ సామంత రాజు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు రాజధాని లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పి, టీడీపీ, జనసేన కూటమికి అధికారం ఇవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పటికైనా రాజధాని విషయంలో వైసీపీ పాలకులు మాయమాటలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు విష్ణుచౌదరి, రమణబాబు, వెంకటరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వర స్వామి కల్యాణం జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 14: మండలంలోని నునపర్తి సిద్ధాశ్రమంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం విశ్వక్షేణ పూజ, పుణ్యాహవాచనం అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. కార్యక్రమాల్లో ధర్మకర్త బొజ్జ అప్పారావు, విశ్రాంత పంచాయతీ రాజ్ డీఈ శశిభూషణ రావు, రెడ్డి నరసింగరావు, గొంప నరసింహనాయుడు, శరభయ్య, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

నాగులాపల్లి ఆలయానికి రూ.పది లక్షల విరాళం

మునగపాక, ఫిబ్రవరి 14: మండలంలోని నాగులాపల్లి సీతారామ, వేంకటేశ్వర, జగన్నాథస్వామి ఆలయానికి ఎమ్మెల్యే కన్నబాబు రూ.పది లక్షలను విరాళంగా అందించారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేని కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఆలయ నిర్మాణ వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని రూ.పది లక్షలను తన వంతుగా అందించారు. అలాగే ఆలయ నిర్మాణానికి నాగులాపల్లి సర్పంచ్ జామి చిన్నమ్మలు లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మళ్ల ఉమామహేశ్వరరావు, మళ్ల కాశీ సురేష్, సింగర్ రాజు, బొడ్డేడ బుజ్జి, భీశెట్టి కోటేశ్వరరావు, భీమరశెట్టి భాస్కరరావు, శరగడం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం

రాంబిల్లి, ఫిబ్రవరి 14 : మండలంలోని వెంకటాపురం రాజరాజేశ్వరి అమ్మవారు ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని, పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు.

'రానున్నది జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వమే'

రాంబిల్లి, ఫిబ్రవరి 14 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వమే ఏర్పాటవుతుందని జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర అన్నారు. మండలంలోని సంతపాలెంలో బుధవారం జనసేన పార్టీ జండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. కార్యక్రమంలో నరేష్, చోడిపల్లి ప్రసాద్, ఎరిపల్లి నాగరాజు, రుత్తల శ్రీను, చోడిపల్లి మంగరాజు, గంగరాజు పాల్గొన్నారు.

పెదపల్లి స్కూలులో విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

ఎలమంచిలి, ఫిబ్రవరి 14: మునిసిపాలిటీలోని పెదపల్లి ఎంపీయూపీ స్కూలు ఆవరణలో వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం సరస్వతీ దేవి, దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటుకు గ్రామానికి చెందిన బొద్దపు కృష్ణ కుటుంబ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 14: పుల్వామా అమరవీరులకు బుధవారం పట్టణంలోని తైక్వాండో క్రీడాకారులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. సత్య స్పోర్ట్సు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరజవాన్ల ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ, అకాడమీ కోచ్ భవానీ, లహరి, తైక్వాండో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణస్వామి కల్యాణం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : రాజుపాలెంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామికి సామూహిక దంపతులతో కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కల్యాణ్‌కుమార్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న మహిళ అరెస్టు

పరవాడ, ఫిబ్రవరి 14 : ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి దిబ్బపాలెం గ్రామానికి చెందిన తిత్తి నరసమ్మ సారాను తీసుకువెళ్తుండగా బుధవారం పట్టుకున్నట్టు ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఆమె వద్ద నుంచి ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

ఘనంగా వసంత పంచమి

కశింకోట, ఫిబ్రవరి 14 : స్థానిక డీపీఎన్ జడ్పీ హైస్కూల్‌లో శ్రీపంచమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీ.అప్పారావు సరస్వతిదేవి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, చంద్రశేఖర్, రంగలక్ష్మి, శేషకుమారి, నీలవేణి,పూర్వపు విద్యార్థి గుళ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

వసంత పంచమి పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో సరస్వతిదేవి పూజను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతిదేవి చిత్రపటానికి విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వసంత పంచమి పూజలు ఘనంగా నిర్వహించారు.

మృతుల కుటుంబాలకు అనిత పరామర్శ



రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అనిత

పాయకరావుపేట, ఫిబ్రవరి 14 : ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత బుధవారం పరామర్శించారు. పట్టణంలోని ఇందిరాకాలనీలో ఇటీవల మరణించిన మల్లవరపు రవి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన దుర్గాకాలనీకి చెందిన సలికే రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులను అనిత పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు కశింకోట సత్తిబాబు, మల్లవరపు రమాకుమారి, వేములపూడి అప్పారావు, గంపల చినరాజు, బోడపాటి శ్రీను, సీహెచ్.పేర్రాజు పాల్గొన్నారు.

విద్యుత్ కోతపై మునగపాక రైతుల రాస్తారోకో



మునగపాక సబ్‌స్టేషన్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

మునగపాక, ఫిబ్రవరి 14 : వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్‌కు బదులు ఏడు గంటలు అందించడంపై రైతులు మండిపడ్డారు. బుధవారం తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి దాడి మునిలినాయుడు ఆధ్వర్యంలో రైతులు స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. వ్యవసాయ రంగానికి నిరంతరం 9 గంటల విద్యుత్‌ను ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నిరంతరం 9 గంటల విద్యుత్‌ను అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. ఉచిత విద్యుత్ అంటూ స్మార్ట్ మీటర్లు బిగిస్తుండడంలో ప్రభుత్వ ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వేసవి రాక ముందే రెండు గంటల కోతలు విధిస్తుండంటే వేసవిలో ఇంకెన్ని గంటలు కోత పెడతారో అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, సీపీఎం నాయకుడు బ్రహ్మాజీ, మునగపాక రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, జానకి, రైతులు పాల్గొన్నారు.

'పేట' వైసీపీ టికెట్ స్థానికులకే కేటాయించాలి : దళిత నేతల డిమాండ్



మాట్లాడుతున్న దళిత నాయకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 14 : రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే కేటాయించాలని పలువురు దళిత నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో దళిత నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దళిత నాయకులు నెలపర్తి అర్జున్ , తదితరులు మాట్లాడుతూ పాయకరావుపేట ఇన్‌చార్జిగా వచ్చిన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు రెండు నెలలు కావస్తున్నా స్థానిక దళిత నాయకులను కనీసం కలవకపోవడం దారుణమన్నారు. బయటి నుంచి వస్తున్న నాయకులకు స్థానిక సమస్యలపై అవగాహన లేక ఒకవర్గం నేతలపై ఆధారపడుతుండడంతో వారే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో సూట్‌కేసుతో వస్తున్న నాయకుడు గెలిస్తే ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారని, లేకుంటే వెంటనే సూట్‌కేసు సర్దుకుని వెళిపోతున్నాడని ఆరోపించారు. స్థానిక వైసీపీ నాయకులు స్పందించి వచ్చే ఎన్నికల్లో వైసీపీ టికెట్ స్థానికురాలైన పెదపాటి అమ్మాజీకి కేటాయించేలా సీఎం జగన్మోహన్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ఈ సమావేశంలో దళిత నాయకులు ముక్కుడుపల్లి దాసు, తాటిపాక లోవరాజు, పల్లా ప్రసాద్, గారా చంటి, మారెళ్ల దుర్గాప్రసాద్, పెదపాటి నూకరాజు, పీతల ప్రసాద్ పాల్గొన్నారు.

సందడిగా రత్నాకర్ దంపతుల వివాహ దినోత్సవం



దాడి రత్నాకర్ దంపతులను గజమాలతో సత్కరించిన అభిమానులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతుల వివాహ దినోత్సవం బుధవారం అభిమానుల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేకును కట్ చేసి స్నేహితులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలకు రత్నాకర్ పంచారు. అనంతరం అభిమానులు రత్నాకర్ దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజిబాబు, యల్లపు శ్రీనివాస్, కోటిపల్లి శ్రీనివాసరావు, సూరిశెట్టి హేమగిరి, గొంతిన లోవఅప్పారావు, విల్లూరి రాజశేఖర్, దొడ్డి రమణ, మళ్ల లక్ష్మీప్రసాద్ తదితరులు రత్నాకర్ దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

పాయకరావుపేట, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీఓస్ నక్కపల్లి తాలూకా యూనిట్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు తహసీల్దారు సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు పీవీ.రమణ, మహిళా కార్యదర్శి ఎ.నూరీడమ్మ, మూర్తి, షరీఫ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సంఘాల ధర్నా

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : స్థానిక నరసింగరావుపేటలోని ఒక ప్రైవేటు కాలేజి వద్ద విద్యార్థి కుటుంబ సభ్యులతో విద్యార్థి సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు మామిడి రమణ, ఎస్.రమణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శివాజీ మాట్లాడుతూ కళాశాలలో ఎం.వంశీ అనే విద్యార్థి ఇంటర్ చదువుతున్నాడని తెలిపారు. కళాశాలలో 12వ తేదీన టీచర్ విద్యార్థిని కొట్టి దుర్భాషలాడడంతో మనోవేదనకు గురై స్వగ్రామం చిట్టియ్యపాలెంలోని ఇంట్లో ఉరిపోసుకుని మరణించాడని పేర్కొన్నారు. ఈ సంఘటనకు యాజమాన్యమే కారణమని, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో విద్యార్థి సంఘాల నాయకులు బాలాజీ, ప్రవీణ్, కార్తీక్, సింహాద్రి, రమేష్, హేమంత్, లక్ష్మణ్, విద్యార్థి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

'మోటారు వాహన చట్టం నిబంధనలు పాటించాలి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14: ప్రతి ఒక్కరూ మోటార్ వాహన చట్టం నిబంధనలను పాటించాలని ఆర్టీవో కేవీ ప్రకాష్ సూచించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మోటార్ వాహన చట్టంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనాలను నిబంధనలు మేరకు నడుపుతామని వాహనచోదకులచే అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పి. ఫైడపునాయుడు, ఎస్‌ఐ సీహెచ్. నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిన్నర బాలుడికి నోబుల్ వరల్డ్స్ రికార్డ్‌లో చోటు



ఏడాదిన్నర బాలుడికి నోబుల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎంపీ సత్యవతి

నక్కపల్లి, ఫిబ్రవరి 14: నక్కపల్లిలోని కోసూరి దుర్గాప్రసాద్, గౌతమి దంపతుల ఏడాదిన్నర వయసు గల కుమారుడు ఈశ్వర్ నోబుల్ వరల్డ్స్ రికార్డ్‌లో చోటు సాధించాడు. మానవ శరీరంలో అవయవాలను ఏడాదిన్న వయసు గల ఈ బాలుడు గుర్తించినందుకు నోబుల్ వరల్డ్స్ రికార్డులో అవకాశం లభించిందని తల్లిదండ్రులు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఎంపీ సత్యవతి, వైసీపీ నేత వీసం రామకృష్ణ చేతుల మీదగా నోబుల్ వరల్డ్స్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందుకున్నట్టు దుర్గాప్రసాద్, గౌతమి దంపతులు తెలిపారు.

రమణకు కరాటేలో బంగారు పతకం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 14: ఈనెల 11న జరిగిన మూడో ఇంటర్నేషనల్ ఓపెన్ ఆల్ స్టైల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో నారపాకకు చెందిన కరాటే మాస్టారు పి.రమణ బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ పోటీల్లో సీనియర్ కేటగిరిలో రమణ బంగారు పతకాన్ని సాధించారు. జూనియర్ విభాగంలో ఈయన వద్ద శిక్షణ పొందిన 20 మందికి బంగారు, 20 మందికి సిల్వర్, 30 మంది బ్రాంజ్ పతకాలు సాధించారు.

ఓటరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు : కలెక్టర్

అనకాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఓటరు గుర్తింపు కార్డు సీఈసీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శంకరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. వివిధ దినపత్రికలలో వచ్చిన ప్రతికూల కథనాలు అనుసరించి వాస్తవాలను పరిశీలించి, సరిదిద్దడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు దాదాపు పూర్తి కావచ్చాయని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, డీటీ రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ ఎదుట కార్మికుల ధర్నా

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్ఏఆర్ఎస్ వద్ద కాంట్రాక్టు కార్మికులు మధ్యాహ్న భోజనం సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా పరిశోధనా కేంద్రంలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయకతప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, కొణతాల నందేశ్వరరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌బీ మాక్ టెస్ట్ విజేతలకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : స్థానిక గౌరీ గ్రంథాలయంలో శ్రీధర్ సీసీఈ విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ మాక్‌టెస్ట్ విజేతలకు బుధవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఈ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ సీసీఈ ప్రతినిధి కె.రమేష్, గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు పాల్గొన్నారు.

'పదో తరగతిలో శతశాతం ఫలితాలకు కృషి'

కోటవురట్ల, ఫిబ్రవరి 14: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాల సాధనకు కృషిచేస్తామని డిప్యూటీ డీఈవో అప్పారావు తెలిపారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేయగా వారి నుంచి సమాధానాలు మంచిగా రావడంతో సంతృప్తి చెందారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు మమేకమైతే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు ఉదయం, సాయంత్రం నిర్వహించాలన్నారు. జిల్లాలో 21,259 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తున్నట్టు చెప్పారు. ఆయనతోపాటు ఎంఈవో రామారావు, ఎస్‌వో సరితదేవి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 14: మండలంలోని రేవుపోలవరంలో మాఘ పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న మండల క్రికెట్ టోర్నమెంట్‌ను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు బుధవారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బంగారి, రాజు సమకూర్చిన దుస్తులను క్రీడాకారులకు వెంకటరాజు అందజేశారు.

'జిల్లా కేంద్రంలో శంకుస్థాపన చేయడం ప్రజలను మోసగించడమే'

నక్కపల్లి, ఫిబ్రవరి 14: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా మండలంలో 1,135 ఎకరాల స్టార్టప్ ఏరియాలో పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా కేంద్రంలో శంకుస్థాపన చేయడం ఏమిటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు.బుధవారం మండలంలో పర్యటించిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ నేతృత్వంలో కారిడర్ భూముల్లో పరిశ్రమల నిర్మాణానికి జిల్లా కేంద్రంలో శంకుస్థాపన చేయడం ఈ ప్రాంత ప్రజలను మోసగించడమేనన్నారు. తక్షణమే డీ పట్టాదారులకు, సాగుదారులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయండి : ఎమ్మెల్యే

ఎలమంచిలి, ఫిబ్రవరి 14: కొక్కిరాపల్లి ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలని, ఈనెల 22వ తేదీన ప్రారంభోత్సవం ఉంటుందని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. బుధవారం ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధితో కలిసి ఆయన పరిశీలించారు. ఫ్లైఓవర్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈనెల 22 వ తేదీన మంత్రి చేతుల మీదుగా ప్రారంభం చేసేందుకు సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మళ్ల కొండబాబు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ బైక్ ర్యాలీ

పరవాడ, ఫిబ్రవరి 14 : ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఫార్మాసిటీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రవాణా కార్మికులకు ఉరితాడులాంటి బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అప్పలరాజు, ఎం.మునిలినాయుడు, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్చియ్యపేటలో భూ కబ్జా

... 5వ పేజీ తరువాయి

పెరిగింది. అచ్చియ్యపేట సర్వే నంబరు 511లో జనగన్న కాలనీకి ఆనుకుని వున్న ప్రభుత్వ భూమిపై స్థానిక వైసీపీ నాయకుల కన్ను పడింది. సుమారు ఎకరా భూమిని చదును చేసి, రెండేసి సెంట్లతో ప్లాట్‌లుగా విభజించారు. అంతర్గత రహదారులు పోను దాదాపు 70 సెంట్ల స్థలాన్ని ప్లాట్లుగా వేశారు. సెంటు స్థలం రూ.3 లక్షల చొప్పున ఒక్కో ప్లాట్‌ను రూ.6 లక్షలకు అమ్ముకుంటున్నట్టు సమాచారం. ఈ లెక్కన ఆక్రమించిన భూమి విలువ రెండు కోట్ల రూపాయలకు పైగా వుంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్న వారికి స్థానిక రెవెన్యూ సిబ్బంది 'సహకారం' అందిస్తున్నారు. స్థలాలను కొనుగోలు చేసిన వ్యక్తులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపడితే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి పట్టా మంజూరు చేయిస్తామని ఆక్రమణదారులకు భరోసా ఇస్తున్నారు. దీంతో స్థలాలను కొనుగోలు చేసిన వారిలో కొంతమంది ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పట్టాలు లేకుండా భూమి ఎలా చదును చేస్తున్నారని వారిని ప్రశ్నించగా, తమకు త్వరలో ఎల్‌పీసీ (ల్యాండ్ పొసెషన్ సర్టిఫికెట్టు) వస్తాయని ధీమాగా చెబుతున్నారు.

అమర్‌కు అవకాశం దక్కేనా?

... 5వ పేజీ తరువాయి

ఆయన్ను అనకాపల్లి నుంచి ఎంపీగా బరిలో దింపడానికి అధిష్ఠానం ఆలోచన చేస్తున్నదంటూ అనుచరులు చెబుతున్నారు. మరోవైపు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిత్వం కోసం సిట్టింగ్ ఎంపీ భీశెట్టి సత్యవతితో పాటు విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు కుమార్తె, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కూడా ప్రయత్నిస్తున్నారు.

నా గురించి జగన్ చూసుకుంటారు

టికెట్‌పై ఒకటి, రెండుసార్లు మంత్రి వద్ద విలేకరులు ప్రస్తావించగా...తన గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని సీఎం జగన్ చూసుకుంటారని, ఆయన ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని, లేదంటే పార్టీ కోసం పనిచేస్తానని, దేనికైనా సిద్ధమేనని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో వారం కిందట అమర్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పార్టీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఆయనకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుందో, లేదో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఉద్యోగాల పేరుతో ఖాకీ చీటింగ్

... 5వ పేజీ తరువాయి

జీకల మోహనరావు, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని మరికొంత మంది నిరుద్యోగులకు చెప్పారు. వీరు చెప్పిన మాటలను నమ్మిన పలువురు నిరుద్యోగులు 2021 నవంబరు నెలలో ఒక్కొక్కరు రూ.4-5 లక్షలు ఇచ్చారు. డబ్బులు తీసుకున్న రమణమూర్తి, మోహన్‌బాబు... ఎన్ని రోజులైనా ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో నిరుద్యోగులు నిలదీశారు. వెంటనే ఉద్యోగాలు ఇప్పించాలి, లేదంటే డబ్బులు వెనక్కి ఇవ్వాలని పట్టుబట్టారు. కానీ వారు స్పందించకపోవడంతో బాధితులు గత నెలలో విశాఖ కలెక్టరేట్ స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును కలెక్టరేట్ అధికారులు విశాఖ పోలీసు కమిషనర్‌కు, అక్కడి నుంచి అనకాపల్లి జిల్లాకు పంపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చోడవరం పోలీసులు ఇటీవల బాధితులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అనంతరం వారి నుంచి ఫిర్యాదు స్వీకరించి కానిస్టేబుల్ రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబులపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

వైసీపీ నేతలు బరి తెగింపు

... 5వ పేజీ తరువాయి

పంట కాలువను పూడ్చివేసి రహదారి ఏర్పాటు చేస్తుండడంతో అనుమానం వచ్చి, ఈ విషయాన్ని టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు వెంటనే వీఆర్వో బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జానకిరామ్‌కు సమాచారం అందించారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి అక్కడకు వెళ్లడంతో కూలీలతో పనులు నిలుపుదల చేయించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జానకిరామ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద పంట కాలువ మీదుగా రోడ్డు ఏర్పాటు పనులకు పంచాయతీ ఎటువంటి తీర్మానం చేయలేదని, కనీసం పనుల అంచనాలు కూడా వేయలేదని చెప్పారు. కాగా ఉపాధి పథకం ఏపీవో గోవిందరావును వివరణ కోరగా, పంట కాలువ మీదుగా రోడ్డు నిర్మాణ పనికి అంచనాలు రూపొందించలేదని, ఆ పనులకు సంబంధించి కూలీలకు డబ్బులు జనరేట్ చేయలేదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరుండి పనులు ఎలా చేయిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. దీనిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా తక్షణమే రహదారిని తొలగిచి, పంట కాలువ నుంచి దిగువ పెద్ద చెరువులోకి నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్ బొండా తాతారావు డిమాండ్ చేశారు.

గత ఏడాది జూలైలోనే కొంతమేర పనులు

ప్రధాన పంట కాలువ నుంచి రహదారి ఏర్పాటు కోసం వైసీపీ నాయకులు గత ఏడాది జూలైలోనే పనులు ప్రారంభించారు. అప్పట్లో కొంతమేర కాలువను పూడ్చివేశారు. ఎక్స్‌కవేటర్‌తో తాటిచెట్లు, ఇతర చెట్లు కూల్చివేయించారు. అప్పట్లో టీడీపీ నాయకులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పనులు నిలిపివేశారు. ఇప్పుడు ఉపాధి హామీ పథకం కింద రహదారి పనులు చేపడుతున్నట్టు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు.

రాజశ్యామల అలంకరణలో కనకదుర్గమ్మ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : స్థానిక సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం రాజశ్యామల దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాఘమాసం పంచమి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు. అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకుడు కాండ్రేగుల నాయుడు, పోలిమేర శ్రీను అమ్మవారిని దర్శించుకున్నారు.

'సంజీవయ్య జీవితం ఎందరికో ఆదర్శం'



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాగేశ్వరరావు, నిర్మలదేవి

సబ్బవరం, ఫిబ్రవరి 14 : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం ఎందరికో ఆదర్శమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం వర్సిటీలో సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంజీవయ్యలోని పట్టుదల, క్రమశిక్షణ ఆయనను ఉన్నత శిఖరాలకు చేర్చాయన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ నిర్మలదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అయోధ్యకు భారీగా భక్తుల పయనం

ఎలమంచిలి, ఫిబ్రవరి 14 : అయోధ్య రామాలయాన్ని సందర్శించి సీతారాములను దర్శించుకునేందుకు బుధవారం ఎలమంచిలి రైల్వే స్టేషన్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వెళ్లారు. ఎస్.రాయవరం, నక్కపల్లి, ఎలమంచిలి మండలాలకు చెందిన వందలాది మంది భక్తులు అయోధ్య ప్రత్యేక రైలులో వెళ్లారు. ఎలమంచిలి నుంచి విశాఖ వెళ్లి అక్కడ నుంచి అయోధ్యకు వెళ్లనున్నట్టు బీజేపీ నాయకులు తెలిపారు.

దమనోత్సవ దివ్యాలంకరణలో శ్యామా అమ్మవారు



సబ్బవరం, ఫిబ్రవరి 14 : మండలంలోని దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు దమనోత్సవ దివ్యాలంకరణలో బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వాగ్దేవి హోమం, రాజశ్యామల హోమం నిర్వహించారు. పలువురికి అక్షరాభ్యాసం చేయించారు. గురుమాత చేతులు మీదగా భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : స్థానిక విజయరామరాజుపేట మరిడిమాంబ అమ్మవారి జాతర పోస్టర్‌ను గ్రామకమిటీ ప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామసత్యనారాయణ, ప్రధానకార్యదర్శి పలకా రాము, వైస్ చైర్మన్ బొబ్బిలి అప్పారావు పాల్గొన్నారు.

బాలుకు సత్కారం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు నేపాల్‌లోని ఖాట్మండ్‌లో నిర్వహించనున్న వరల్డ్ సోషల్ ఫోరమ్‌లో అనకాపల్లి నివాసి గాడి బాలు పాల్గొంటున్నారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందింది. ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాల ప్రతినిధులు పాల్గొనే ఈ ఫోరమ్‌లో వ్యవసాయ కూలీలు స్థితిగతులు, ప్రభుత్వ విధానాలు, ఆదివాసీలు, వలస కూలీల కోసం నూతన విధానాల అన్వేషణ అనే అంశాలపై మాట్లాడే అవకాశం లభించింది. బుధవారం గాడి బాలును ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాజాన దొరబాబు, కనిశెట్టి సురేష్‌బాబు, చదరం నాగేశ్వరరావు, పాత్రపల్లి వీరుయాదవ్, డొక్కరి హరీష్ కొనియాడారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు : ఎంపీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలందేలా చర్యలు తీసుకుంటుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక ఉడ్‌పేట స్కూల్‌లో బుధవారం ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం తరగతులు ఈ ఏడాది నుంచి ప్రారంభమవుతాయని, ఈనెల 23వ తేదీన తరగతి గదులు పరిశీలించేందుకు కేంద్రీయ విద్యాలయం ప్రతినిధులు రానున్నారని ఆమె తెలిపారు.శిబిరానికి హాజరైన వారిని ఎంపీ స్వయంగా పరీక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, వైద్యులు నీరజ, జ్యోత్స్న, వైసీపీ నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా అప్పలనాయుడు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 14: కొండకర్ల, అందలాపల్లి సహకార బ్యాంక్ అధ్యక్షుడిగా జాగారపు అప్పల నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో సీనియర్ నాయకుడైన అప్పలనాయుడు గతంలో చీమాపల్లి ఎంపీటీసీ సభ్యునిగా కూడా చేశారు. అప్పలనాయుడుని కోన బుజ్జి, పిన్నమరాజు వాసు, దేశంశెట్టి శంకరరావు, కోట్ని శివ తదితరులు అభినందించారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

కశింకోట, ఫిబ్రవరి 14: దిశ చట్టాలు, రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ కె.రమణి అన్నారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో దిశ చట్టాలు, రహదారి భద్రతలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అంతకుముందు కశింకోట వీధుల్లోను, జాతీయ రహదారిపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ వి.ధర్మారావు, ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు సత్యనారాయణ, శ్రీను, రామకృష్ణ, అనురాధ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతప్పుడు ఆరోపణలు చేయడం తగదు

» టీడీపీ నేతలు సత్యనారాయణ, నాగేష్

రాంబిల్లి, ఫిబ్రవరి 14 : తాము జీవన భృతి ప్యాకేజీ కోసం సంతకాలు పెట్టామంటూ ఎమ్మెల్యే కన్నబాబురాజు తప్పుడు ఆరోపణలు చేయడం తగదని కొత్తపట్నం మాజీ సర్పంచ్ చోడిపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకుడు ఉమ్మిడి నాగేష్ అన్నారు. బుధవారం వారు ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ కొత్తపట్నం, వాడనర్సాపురం గ్రామాల నేవీ నిర్వాసిత మత్స్యకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన జీవనభృతి ప్యాకేజీ జాబితాల్లో కొన్ని సమస్యలు చోటుచేసుకోవడంతో టీడీపీకి చెందిన లబ్ధిదారులు ప్యాకేజీ తీసుకొనేందుకు సంతకాలు పెట్టలేదన్నారు. ఇటీవల వాడనర్సాపురంలో వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్యాకేజీ రాదంటూ టీడీపీ నేతలు ప్రచారం చేసి ప్యాకేజీ కోసం అందరి కంటే ముందుగా సంతకాలు పెట్టారని మాట్లాడడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. మేము సంతకాలు పెట్టకపోయినా వైసీపీ నేతలు మాటలు విని ఎమ్మెల్యే కన్నబాబు తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిర్వాసితుల కృషితోనే ప్యాకేజీ వచ్చిందని టీడీపీ నేతలు పేర్కొన్నారు.

దేశవ్యాప్త బంద్‌ని జయప్రదం చేయాలి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 14: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కె.సోమినాయుడు కోరారు. బుధవారం బంద్‌పై అచ్యుతాపురంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కె. మహలక్ష్మినాయుడు, ఓ.ససన్యాసిరావు, డి.నాయుడు, సీహెచ్.సన్యాసిరావు పాల్గొన్నారు.

గూడూ కరువే.. కూడూ కరువే..!!

- నిరుపేద కుటుంబానికి కొండంత కష్టం
- పూరిల్లు అగ్నికి ఆహుతి కావడంతో తీవ్ర ఇబ్బందులు
- ఘటన జరిగి రెండు నెలలు దాటినా కన్నెత్తి చూడని పాలకులు



ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబం



పనసగెడ్డలో దగ్ధమైన పూరిల్లు (ఫైల్)

చీడికాడ, ఫిబ్రవరి 14 : అసలే కటిక దారిద్ర్యం.. ఆపై అగ్నిదేవుడు ఆగ్రహం.. వెరసి ఓ నిరుపేద కుటుంబం జీవనం దుర్భరంగా మారింది. తినడానికి తిండి కరువై.. ఉండడానికి గూడు కరువై.. కష్టాల్లో ఉన్న వారు సాయం కోసం రెండు నెలలకు పైగా ఎదురు చూపులు చూస్తున్నారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధుల మనసు కరగడం లేదు.. అధికారులు జాలి చూపడం లేదు. ఫలితంగా ఆ దంపతులు ఇద్దరు పిల్లలతో బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని కోనాం శివారు పనసగెడ్డ గిరిజన గ్రామంలో వంటాల రాజు, లక్ష్మిలు నివాసం ఉంటున్న పూరిల్లు గత ఏడాది డిసెంబరు 26వ తేదీన దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరగడంతో వస్తువులన్నీ కాలి బూడిదై కట్టుబట్టలతో మిగిలారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో వారువచ్చి పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి తహసీల్దార్ కార్యాలయానికి అందించారు. నష్టపరిహారం అందు తుందని నాటి నుంచి నేటి వరకు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. కానీ ఆదుకునేవారు కరువయ్యారు. పేదరికంలో ఉన్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులంతా వేడుకుంటున్నారు. దీనిపై డిప్యూటీ తహ సీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా, జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు.

వీర జవాన్ల పోరాటానికి విద్యార్థులు జేజేలు



చమ్మచింతలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నాతవరం, ఫిబ్రవరి 14 : వీరజవాన్ల సేవలను స్మరిస్తూ బుధవారం చమ్మచింతలో విద్యార్థులు జాతీయ జెండాను చేతబట్టి పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. పుల్వామా దాడిలో 40మంది వీర జవాన్లు మృతిచెంది నేటికి ఐదు సంవత్సరాలైన సందర్భంగా వారి సేవలను కీర్తిస్తూ విద్యార్థులు ఈ ర్యాలీని జరిపారు. ఉపాధ్యాయులు ఎస్.జగనార్థనరావు, బ్రహ్మాజీ, సుజన, ఇందు, కృప, శ్రేయోభిలాషి సంస్థ వ్యవస్థాపకులు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్‌లతో అలరించిన 'కస్తూర్బా' విద్యార్థినులు



వేడుకల్లో డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థినులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 14 : బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రత్యేకాధికారిణి సిహెచ్ భువన మాధురి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎంఈవో బి.పడాల్‌దాసు, ఉషారాణి, కె.వీరమణ, కె.శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రంధి వెంకటరావు సమకూర్చిన పరీక్షా మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

ఉద్యోగాల పేరుతో ఖాకీ చీటింగ్

... 5వ పేజీ తరువాయి

డోకల మోహనరావు, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని మరికొంతమంది నిరుద్యోగులకు చెప్పారు. వీరు చెప్పిన మాటలను నమ్మిన పలువురు నిరుద్యోగులు 2021 నవంబరు నెలలో ఒక్కొక్కరు రూ.4-5 లక్షలు ఇచ్చారు. డబ్బులు తీసుకున్న రమణమూర్తి, మోహన్‌బాబు.. ఎన్ని రోజులైనా ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో నిరుద్యోగులు నిలదీశారు. వెంటనే ఉద్యోగాలు ఇప్పించాలి, లేదంటే డబ్బులు వెనక్కి ఇవ్వాలని పట్టుబట్టారు. కానీ వారు స్పందించకపోవడంతో బాధితులు గత నెలలో విశాఖ కలెక్టరేట్ స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును కలెక్టరేట్ అధికారులు విశాఖ పోలీసు కమిషనర్‌కు, అక్కడి నుంచి అనకాపల్లి జిల్లాకు పంపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చోడవరం పోలీసులు ఇటీవల బాధితులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అనంతరం వారి నుంచి ఫిర్యాదు స్వీకరించి కానిస్టేబుల్ రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబులపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

అమర్‌కు అవకాశం దక్కేనా?

... 5వ పేజీ తరువాయి

ఆయన్ను అనకాపల్లి నుంచి ఎంపీగా బరిలో దింపడానికి అధిష్ఠానం ఆలోచన చేస్తున్నదంటూ అనుచరులు చెబుతున్నారు. మరోవైపు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిత్వం కోసం సిట్టింగ్ ఎంపీ భీశెట్టి సత్యవతితో పాటు విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు కుమార్తె, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కూడా ప్రయత్నిస్తున్నారు.

నా గురించి జగన్ చూసుకుంటారు

టికెట్‌పై ఒకటి, రెండుసార్లు మంత్రి వద్ద విలేకరులు ప్రస్తావించగా..తన గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని సీఎం జగన్ చూసుకుంటారని, ఆయన ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని, లేదంటే పార్టీ కోసం పనిచేస్తానని, దేనికైనా సిద్ధమేనని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో వారం కిందట అమర్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పార్టీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఆయనకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుందో, లేదో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు విధులకు హాజరు

- సమస్యలు పరిష్కరించాలని నినాదాలు
- నర్సీపట్నం, నాతవరంలలో అధికారులకు వినతి పత్రాలు సమర్పణ



నాతవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నర్సీపట్నం, ఫిబ్రవరి 14 : ప్రభుత్వ ఉద్యో గుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎం యూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. 12వ పీఆర్సీ మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలు విడుదల చేయాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, క్లైమ్‌లు, 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్ క్యాష్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని పేర్కొన్నారు. అలాగే, ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కేఎస్‌రావు, పెదిరెడ్ల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.21 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ బుధవారం నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవోస్ కోటవురట్ల తాలుకా అధ్యక్షుడు కె.వెంకటరమణ మాట్లాడుతూ డీఏలు, జీపీఎస్, సరెండర్ లివ్ తదితర బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పూర్తిస్థాయిలో రెగ్యులర్ చెయ్యాలన్నారు. అనంతరం నాతవరం తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలెపు ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ చైనులు, త్రివేణి, బైరాగి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ యాత్రలతో వైసీపీలో వణుకు

- టీడీపీ చోడవరం నియోజకవర్గ నేతలు ఆరోపణ
- వడ్డాదిలో శంఖారావం సభా స్థలం పరిశీలన



వడ్డాదిలో సభా స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన నాయకులు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 14 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఏ యాత్ర చేపట్టినా వైసీపీలో వణుకు కనిపిస్తుందని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు అన్నారు. మండలంలోని వడ్డాది గ్రామంలో ఈ నెల 20వ తేదీన లోకేశ్ శంఖారావం సభకు బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల శంఖారావం పేరుతో లోకేశ్ యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండడంతో వైసీపీ పాలకులు బెంబేలు పడుతున్నారన్నారు. యువ గళం పాదయాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లో లోకేశ్ ధైర్యం నింపారన్నారు. వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా సుదీర్ఘ పాదయాత్ర చేశారన్నారు. ఇప్పుడు శంఖారావం పేరుతో జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలు, అవినీతి, అన్యాయాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలను అన్నిరంగాల్లో మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు తమరాన దాసు, సాయం శేషు, సింగంపల్లి రమేష్, సయ్యపురెడ్డి శ్రీను, దొండా వెంకటరమణ, అక్కిరెడ్డి కనకరాజు, గంగరాజు, గొన్నాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఊరేగింపులో భక్తులు

గొలుగొండ, ఫిబ్రవరి 14 : మండలంలోని చీడిగుమ్మలలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది దంపతులకు వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలతో మహిళలు విచ్చే అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గౌరీపరమేశ్వరుల విగ్రహానికి మేళతాళాలు, బాజా భజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వరహ నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు, సర్పంచ్ చినబ్బాయి, నాయకులు ఇటంశెట్టి రామకృష్ణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు



పెదబొడ్డేపల్లి సామూహిక అక్షరాభ్యాసం దృశ్యం

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 14 : పెదబొడ్డేపల్లి కోనేరు వద్ద గల జ్ఞానసరస్వతి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. పిల్లలకు సామూహికంగా అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బాబూరావు తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది.

చోడవరం : పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో అర్చకులు చలపతి ఆధ్వర్యంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అలాగే, ఇక్కడి శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి హోమాన్ని వేదపండితులు రామం, ధవళ శ్రీను, ధవళ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించగా, పాఠశాలలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలను పండితులు గోపాలాచార్యులు, శ్రీనివాసులు నిర్వహించారు. 179మంది చిన్నారులు అక్షరాభ్యాసం చేశారని స్కూల్ డైరెక్టర్ ఎం.ఎం.కె.రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవస్థలు తెచ్చిపెట్టిన 'ఆసరా' వేడుక!



డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

మాకవరపాలెం, ఫిబ్రవరి 14 : ఆసరా పథకం చెక్కుల పంపిణీ విద్యార్థులకు ఇక్కడ అవస్థలు తెచ్చిపెట్టిందని చెప్పక తప్పదు. మాకవరపాలెం హైస్కూల్‌లో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి పాఠశాల ఆవరణలో కోలాహలం మొదలైంది. టెంట్లు వేయడంతో పాటు పెద్దగా మైక్‌సెట్లు సౌండు పెట్టారు. పది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పాఠశాల అవరణలో అధికార పార్టీ నాయకుల ప్రసంగాలు, పాటలతో అంతా మార్మోగింది. దీంతో విద్యార్థులకు పాఠాలు అర్థంకాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అసలే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18వతేదీన ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో ప్రతి నిమిషాన్ని వారు అత్యంత విలువైనదిగా పరిగణిస్తున్నారు. ఈ సమయంలో ఇక్కడ ఇలాంటి వేడుక జరపడాన్ని చూసినవారంతా ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేయగా, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే, ఎమ్మెల్యే గణేశ్ అసరా పథకం కింద నాలుగో విడతగా 13,597 మంది డ్వాక్రా మహిళలకు రూ.9.26 కోట్ల నమూనా చెక్కులను అందజేశారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు రుత్తల వాసు, తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, వెలుగు ఏపీఎం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధిపై దృష్టి : విప్ ధర్మశ్రీ



రోడ్డు ప్రారంభోత్సవంలో విప్ ధర్మశ్రీ

చోడవరం, ఫిబ్రవరి 14 : నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు విప్ ధర్మశ్రీ తెలిపారు. సింహాద్రిపురం- లక్ష్మవరం పంచాయతీల పరిధిలో అభివృద్ధి చేసిన తారురోడ్డును బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక నాయకులు సింహాద్రిపురం రాజు, లక్ష్మవరం రమణ, సేనాపతి శ్రీను, ఆర్అండ్‌బీ జేఈ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బంద్‌ను విజయవంతం చేయండి'



చోడవరం, ఫిబ్రవరి 14 : రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగంపై తీసుకుని వచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాటం చేసిన తరువాత, కూడా రైతాంగం డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపించలేదని విమర్శించారు. రైతులను నిర్లక్ష్యం చేసిన కేంద్ర ప్రభుత్వానికి, వాటికి మద్దతు ఇస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నూరిశెట్టి జాన్, నారాయణరావు, రంగనాథం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

18న ఆర్వై అగ్రహారంలో పుష్పయాగం

కె.కోటపాడు, ఫిబ్రవరి 14 : మండలంలోని రామయోగి అగ్రహారం గ్రామంలో హనుమాన్ లక్ష్మణ సమేత సీతారామస్వామి సన్నిధిలో ఈ నెల 18న పుష్పయాగం జరపనున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధి రమణమూర్తి తెలిపారు. సింహాచలం దేవస్థానం నుంచి వచ్చే పదకొండు మంది వేద పండితుల ఆధ్వర్యంలో టన్నున్నర పుష్పాలతో యాగం నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఎంపీపీ కార్యాలయ భవన మరమ్మతుకు నిధులు

నాతవరం, ఫిబ్రవరి 14 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ భవనం మరమ్మతు పనులకు రూ.మూడు లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్టు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఈ నిధులతో కార్యాలయంలో గదులు, సమావేశ మందిరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. అలాగే పెచ్చులూడిపోయిన ప్రాంతంలో, ఇతరచోట్ల మరమ్మతు పనులు చేస్తామని ఎంపీపీ లక్ష్మణమూర్తి తెలిపారు.

తారువలో క్రీస్తు సువార్త మహోత్సవాలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 14 : తారువ గ్రామంలో మెసయ్య మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రీస్తు సువార్త మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ హాజరయ్యారు. సాల్మన్‌రాజు, జాషువా తదితరులు పాల్గొన్నారు.

గర్నికంలో బాలచెంచమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం, ఫిబ్రవరి 14 : మండలంలోని గర్నికం గ్రామంలో బాలచెంచమ్మ తీర్థం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పూజలు విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. రావికమతం, కొత్తకోట ఎస్ఐలు ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఆర్లిలో సీతారాముల తీర్థం



స్వామిని దర్శించుకుంటున్న ప్రసాదరావు తదితరులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 14 : ఆర్లి గ్రామంలో సీతారాముల తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు స్థానిక నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండారు నారాయణమూర్తి, బోశం బుల్లిదొర, బండారు దొరబాబు, గొంప దేముళ్లు, వంటాకు శ్రీను, కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింగందొరపాలెంలో కృష్ణాలయం ప్రారంభం



ఆలయం అభివృద్ధికి నగదును అందిస్తున్న గవిరెడ్డి

కె.కోటపాడు, ఫిబ్రవరి 14 : సింగందొరపాలెంలో నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నాయకులు పీవీజీ కుమార్, పైలా ప్రసాదరావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి రామానాయుడు నగదును అందజేశారు. సర్పంచ్‌లు పూడి నారాయణమూర్తి, వెలగల పైడంనాయుడు, మాజీ ఎంపీటీసీ పిల్లల రమణ, జామి రమణేశ్వరరావు, పిల్లల దేవుడిబాబు, మహాలక్ష్మి, బండారు నరసింహనాయుడు, గోకాడ ఝాన్సీ పాల్గొన్నారు.

కాశీపురంలో రామాలయం ప్రారంభం

దేవరాపల్లి, ఫిబ్రవరి 14 : కాశీపురంలో రామాలయం ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పురోహితులు కాశీవజ్ఝల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, న్యూరాలజీ వైద్యులు బొడ్డు దేముడుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమి రెడ్డి. సూర్యనారాయణ దర్శించుకున్నారు. అలాగే వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనూరాధ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, అప్పారావు, మంగునాయుడు తది తరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్‌పురంలో సీతారాములవారి తీర్థం

చీడికాడ, ఫిబ్రవరి 14 : ఎల్ఎన్ పురంలో సీతారాముల వారి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ముగ్గుల పోటీలు నిర్వహించగా, సాయంత్రం ఆరు గం టలకు షటిల్ టోర్నమెంటు ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే, చుక్కపల్లి గ్రామంలో గురువారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నారు

'విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న ఎంఈవో జగ్గారావు

రోలుగుంట, ఫిబ్రవరి 14 : విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాని ఎంఈవో జగ్గారావు సూచించారు. బుచ్చెంపేట జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన లాం గ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంకు బుధవారం ఆయన హాజరై పలు సూచనలు చేశారు. నోడల్ హెచ్ఎం శెట్టి మోహన్ రావు, లిప్ టీం సభ్యులు అప్పన రాంబాబు, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ సామగ్రి వితరణ

మాకవరపాలెం, ఫిబ్రవరి 14 : జంగాలపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలకు బుధవారం గ్రామానికి చెందిన సత్యనారాయణ కంప్యూటర్ సామగ్రి అందించారు. ఎంఈవోలు జాన్‌ప్రసాద్, మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు బరి తెగింపు

... 5వ పేజీ తరువాయి

పంట కాలువను పూడ్చివేసి రహదారి ఏర్పాటు చేస్తుండడంతో అనుమానం వచ్చి, ఈ విషయాన్ని టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు వెంటనే వీఆర్వో బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జానకిరామ్‌కు సమాచారం అందించారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి అక్కడకు వెళ్లడంతో కూలీలతో పనులు నిలుపుదల చేయించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జానకిరామ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద పంట కాలువ మీదుగా రోడ్డు ఏర్పాటు పనులకు పంచాయతీ ఎటువంటి తీర్మానం చేయలేదని, కనీసం పనుల అంచనాలు కూడా వేయలేదని చెప్పారు. కాగా ఉపాధి పథకం ఏపీవో గోవిందరావును వివరణ కోరగా, పంట కాలువ మీదుగా రోడ్డు నిర్మాణ పనికి అంచనాలు రూపొందించలేదని, ఆ పనులకు సంబంధించి కూలీలకు డబ్బులు జనరేట్ చేయలేదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరుండి పనులు ఎలా చేయిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. దీనిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా తక్షణమే రహదారిని తొలగించి, పంట కాలువ నుంచి దిగువ పెద్ద చెరువులోకి నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్ బొండా తాతారావు డిమాండ్ చేశారు.

గత ఏడాది జూలైలోనే కొంతమేర పనులు

ప్రధాన పంట కాలువ నుంచి రహదారి ఏర్పాటు కోసం వైసీపీ నాయకులు గత ఏడాది జూలైలోనే పనులు ప్రారంభించారు. అప్పట్లో కొంతమేర కాలువను పూడ్చివేశారు. ఎక్సకవేటర్‌తో తాటిచెట్లు, ఇతర చెట్లు కూల్చివేయించారు. అప్పట్లో టీడీపీ నాయకులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పనులు నిలిపివేశారు. ఇప్పుడు ఉపాధి హామీ పథకం కింద రహదారి పనులు చేపడుతున్నట్టు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు.

ఇండోర్ సబ్ స్టేషన్ టవర్ మార్పు

నర్సీపట్నం, ఫిబ్రవరి 14 : పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం లేకుండా అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు విద్యుత్ స్తంభాలను మార్చారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని ఇండోర్ సబ్ స్టేషన్‌కు సంబంధించి భారీ టవర్ మెయిన్ రోడ్డు మీద ఏర్పాటు చేశారు. రోడ్డు అభివృద్ధి పనులకు అడ్డుగా ఉండటంతో బుధవారం భారీ యంత్ర సహాయంతో దానిని డ్రైనేజీ అవతలకు మార్చారు. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డ్రైనేజీ, సెంటర్ డివైడర్ పనులు పూర్తిచేశారు. ఈపీడీసీఎల్ అధికారులు గత రెండు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి పనులకు ఆటంకంగా ఉన్న పన్నెండు స్తంభాలను మార్చారు. త్వరలో బీటీ రోడ్డు వేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

అచ్చియ్యపేటలో భూ కబ్జా

... 5వ పేజీ తరువాయి

పెరిగింది. అచ్చియ్యపేట సర్వే నంబరు 511లో జగనన్న కాలనీకి ఆనుకుని వున్న ప్రభుత్వ భూమిపై స్థానిక వైసీపీ నాయకుల కన్ను పడింది. సుమారు ఎకరా భూమిని చదును చేసి, రెండేసి సెంట్లతో ప్లాట్‌లుగా విభజించారు. అంతర్గత రహదారులు పోను దాదాపు 70 సెంట్ల స్థలాన్ని ప్లాట్లుగా వేశారు. సెంటు స్థలం రూ.3 లక్షల చొప్పున ఒక్కో ప్లాట్‌ను రూ.6 లక్షలకు అమ్ముకుంటున్నట్టు సమాచారం. ఈ లెక్కన ఆక్రమించిన భూమి విలువ రెండు కోట్ల రూపాయలకు పైగా వుంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్న వారికి స్థానిక రెవెన్యూ సిబ్బంది 'సహకారం' అందిస్తున్నారు. స్థలాలను కొనుగోలు చేసిన వ్యక్తులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపడితే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి పట్టా మంజూరు చేయిస్తామని ఆక్రమణదారులకు భరోసా ఇస్తున్నారు. దీంతో స్థలాలను కొనుగోలు చేసిన వారిలో కొంతమంది ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పట్టాలు లేకుండా భూమి ఎలా చదును చేస్తున్నారని వారిని ప్రశ్నించగా, తమకు త్వరలో ఎల్‌పీసీ (ల్యాండ్ పొసెషన్ సర్టిఫికెట్లు) వస్తాయని ధీమాగా చెబుతున్నారు.